# విశాల హృదయం

- రావి-ఎన్-అవధాని

రాజేశ్వరమ్మ కల్లాకపటం లేని మనిషి. ముక్కుకు సూటిగా పోయే వ్యక్తి. ఆమెకు లౌక్యం తెలియదు ఏ విషయమైనా ఎవరితోనైనా నిర్మొహమాటంగా మాట్లాడుతుంది. నిగర్వి. దానధర్మాలు విరివిగా చేస్తుంది. ఆమె వయస్సు 65 సంవత్సరాలు. మనిషి ఆరోగ్యంగా వుంటుంది. ఆమెను చూసినవారెవ్వరూ ఆమెకు అంత వయస్సు ఉంటుందనుకోరు.

రాజేశ్వరమ్మ భర్త పరమేశ్వరశాస్త్రిగారు ఇంజనీర్‌గా పని చేసి రిటైర య్యారు. ఏడాది క్రితమే చనిపోయారు. వారికి నలుగురు కొడుకులు. పెద్దవాడు అమరేంద్ర డాక్టర్. అతని భార్య సుశీల. వారి కొడుకు కార్తీక్. రెండోవాడు ఉపేంద్ర. బ్యాంకు మేనేజర్. అతని భార్య సరోజిని. వారి కొడుకు ఈశ్వర్. మూడోవాడు నరేంద్ర. లెక్చరర్. అతని భార్య గాయత్రి. వారి కుమారుడు రాజేంద్ర. నాలుగోవాడు మహేంద్ర, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. అతనికి నెలరోజుల క్రితమే విశాలతో వివాహమైంది.

విశాల సామాన్యమైన కుటుంబంలో జన్మించింది. టెన్త్ పాసయింది. ఆమె తండ్రి స్కూల్ టీచర్.

విశాలకు కోరికలు కొండంతలున్నాయి. రాజేశ్వరమ్మ తన కొడుకుల పెళ్లిళ్లలో కట్నకానుకలు తీసుకోలేదు.

పరమేశ్వరశాస్త్రిగారు భార్య అభిరుచికి తగిన విధంగా విశాలమైన ఆవరణలో రెండంతస్తుల మేడ కట్టించారు. రాజేశ్వరమ్మకు మొక్కలంటే ప్రాణం. ఇంటి ఆవరణలో రకరకాల పూల మొక్కలు, పండ్ల చెట్లు, కాయగూరల మొక్కలు వేయించి వాటి సంరక్షణకు పనివాడిని నియమించింది.

కన్నవారింట కన్న కలలను అత్తవారింట తీర్చుకోవాలనుకుంది విశాల. అయితే అత్తవారింట పరిస్థితులు వేరుగా కనిపించాయి ఆమెకు.

రాజేశ్వరమ్మగారిది ఉమ్మడి కుటుంబం. ఆమె నలుగురు కొడుకులు తల్లి మాటకు కట్టుబడి ఉంటారు. ముగ్గురు కోడళ్లు అత్తగారి ఆజ్ఞ జవదాటరు.

ఆమెను ఎంతో గౌరవిస్తున్నారు. పనివారి సంగతి సరేసరి. ఆమెకు చెప్పకుండా ఎవరూ ఏ పని చేయడంలేదు. వంటావిడ మర్నాడు చేయవలసిన వంటకాలు, టిఫిన్లు వగైరాలు తొలిరోజే ఆవిడను అడిగి తెలుసుకుని ఆ ప్రకారమే చేస్తుంది.

ఇంట్లోవారి అవసరాలకు ఒక కారు, మూడు స్కూటర్లు ఉన్నాయి. అమరేంద్ర కారు వాడుకుంటాడు.

మిగిలిన ముగ్గురూ స్కూటర్లు వాడుకుంటారు. అమరేంద్ర ముగ్గురు పిల్లల్నీ ఉదయం తనతో కార్లో తీసుకుని వెళ్లి స్కూల్లో దింపి తాను డ్యూటీకి వెళ్తాడు. సాయంత్రం డ్రైవర్ వారిని ఇంటికి తీసుకువస్తాడు.

రాజేశ్వరమ్మ నలుగురు కొడుకులూ తమ సంపాదన ఆమెకే ఇస్తారు.

విశాల అత్తవారింట వంట పనిగానీ, ఇంటి పనిగానీ చేయాల్సిన అవసరంలేదు. అందుకు ఎంతో సంతోషించింది. ఖరీదైన చీరలు, నగలు ధరించాలన్న కోరిక నెరవేరింది. రాజేశ్వరమ్మ గారు కోడలికి పెళ్లిలో ఎన్నో నగలు పెట్టారు. అవసరానికి మించి చీరలు కొనిచ్చారు. అత్తవారింట విశాల తన నగలన్నీ వేసుకుని తిరుగుతోంది. ఇంట్లో మిగిలిన కోడళ్లు ఎవ్వరూ నగలు వేసుకోవడంలేదు. అందువల్ల కాస్త గిల్టీగా ఫీలవుతోంది.

తోటికోడళ్లకు, పిల్లలకు సినిమాలు, షికార్ల సరదాలేవీ ఉన్నట్లు కనిపించలేదు. ఇంట్లో వారంతా రాజేశ్వరమ్మగారికి భయపడి తమ సరదాలను చంపుకుని సుఖ సంతోషాలకు దూరమవుతున్నారనుకుంది. విశాలకు ఈ పద్ధతి నచ్చలేదు. పంజరంలో పక్షిలా అనిపించింది. దీనికంతకూ ముఖ్యకారణం డబ్బు పెత్తనం అంతా ఆవిడ చేతిలో వున్నందువల్లే అనుకుంది. సాధ్యమైనంత త్వరగా దానికి పరిష్కారం చూడాలనుకుంది.

ఒకరోజు భర్తను అడిగింది.

"ఏమండీ! మీ నలుగురు అన్నదమ్ములు మీ సంపాదన మొత్తం తీసుకుని వచ్చి మీ అమ్మగారికి ఇచ్చేస్తున్నారు. మరి మీ అన్నలకు పిల్లలున్నారు. వాళ్లకు రోజూ పాకెట్ మనీ ఇవ్వాలి. పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు వగైరా అవసరముంటుంది. పైగా ఆడవాళ్లకు ఏవో ఖర్చులుంటాయి. అందుకోసం జీతంలో కొంత డబ్బు చేతిలో వుంచుకోరా?"

భార్య మాటలకు చిరునవ్వు నవ్వాడు మహేంద్ర.

"అటువంటిదేమీలేదు. పిల్లలెవ్వరికీ బయట కొనుక్కుని చిరుతిళ్లు తినే అలవాటులేదు. వాళ్లకు కావాల్సినవన్నీ ఒకేసారి సూపర్‌బజార్ నుండి కొని తెచ్చి పెడతాం. ఎవరికి కావాల్సినవి వారు తీసుకుంటారు. వంటావిడ రోజుకోరకం టిఫిన్ పిల్లలకోసం చేస్తుంది. ఇక ఎవరికైనా డబ్బు అవసరముంటే అమ్మనడిగి తీసుకుంటాం" అన్నాడు.

భర్త సమాధానం విశాలకు సంతృప్తికరంగా లేదు.

తోటికోడళ్లనూ ఇదే విషయం మాటల సందర్భంలో అడిగింది.


"మేము షాపింగ్‌కుకానీ, బజారుకుగానీ బయటకు మరేపనిమీద వెళ్లినప్పుడుగానీ మాకు అవసరమైనంత డబ్బు తీసుకుంటాం. అత్తయ్యగారు మమ్మల్ని ఇంతవరకూ దేనికి? ఎందుకు? అని అడగలేదు. లెక్కలు అడగలేదు. తాళాలు మా చేతికిస్తారు. మాకు అవసరమైనంత తీసుకుంటాం. మిగిలిన డబ్బు తెచ్చి తిరిగి బీరువాలో

వుంచుతాం'' అన్నారు.

'అత్తగారు ఎంతో చాకచక్యంగా కొడుకుల్ని, కోడల్ని గుప్పెట్లో పెట్టుకుని ఆడిస్తున్నారు' అనుకుంది.

చేతిలో డబ్బు లేనందువల్ల విశాలకు రోజురోజుకూ అసహనం పెరిగిపోతోంది.

ప్రతి చిన్న విషయానికి చిరాకుపడడం, అత్తగారిని సూటిపోటి మాటలతో తూలనాడడం, వంటావిడను, పనివారిని కసరడం వంటివి చేస్తోంది. అయితే ఆమె ప్రవర్తనను ఎవరూ ఏమాత్రం పట్టించుకోవడంలేదు.



★★★

"ఏమండీ! మీ పెద్దన్నయ్యగారు కారు కొనుక్కుని వాడుకుంటున్నారు. మరి మీరెవ్వరూ ఎందుకు కొనుక్కోలేదు?'' అని భర్తను అడిగింది.

"అదా! మా ఆఫీసులు చాలా దగ్గర. కిలోమీటర్ దూరంలోనే ఉన్నాయి. అన్నయ్య హాస్పిటల్ ఆరుకిలోమీటర్ల దూరంలో ఊరి చివర వుంది. మాకు కారు అవసరంలేదు.''

"బాగుంది. మీకు అవసరం లేకపోవచ్చు. మరి మా తోటికోడళ్లు గుడికి వెళ్లాలన్నా, షాపింగ్, చుట్టాలు, స్నేహితుల ఇళ్లకు వెళ్లాల్సి వస్తే?''

"దానికేం? డ్రైవర్‌కి చెప్తే మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు కారు తీసుకుని వస్తాడు. లేదా అన్నయ్యకు ఫోన్ చేస్తే పంపిస్తాడు. ఈ విషయం వదినలకు తెలుసు'' అన్నాడు.

భర్త సహకారం తనకు ఏ విధంగానూ లభించడంలేదు అనుకుంది విశాల.

ఇంట్లో అందరిదీ ఒకే మాట. వారిని ఏ విధంగా తనవైపు తిప్పుకోవాలా అని ఆలోచిస్తోంది.

★★★

ఒకరోజు విశాల పినతల్లి తన కొడుక్కి పెళ్లి నిశ్చయమయిందనీ, శుభలేఖలు పంపించామనీ, సమయం లేనందున స్వయంగా వచ్చి పిలువలేకపోతున్నామని, పెళ్లికి అందర్నీ రమ్మనమని ఫోన్ చేసి రాజేశ్వరమ్మకు చెప్పింది. పెళ్లికూతురికి చీరలు కొనాలి, వీలుంటే విశాలను రెండురోజులు ముందుగా పంపమని, పెళ్లికి నాలుగురోజులే వ్యవధి ఉందని మరీ మరీ చెప్పింది.

విశాలతోనూ ఫోనులో మాట్లాడిందావిడ.

విశాల పినతల్లి భర్త రెండేళ్లక్రితమే పోయారు. ఒక్కడే కొడుకు.

ఎమ్ఆర్వో ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. విశాలకన్నా ఏడాది చిన్న. ఈ వివరాలు విశాల అత్తగారికి, భర్తకు చెప్పింది.

విశాల భర్త, అత్తగారు ఆమెను మర్నాడు ఉదయమే వెళ్లమన్నారు. వీలు చూసుకుని ముహూర్తంవేళకు మహేంద్ర వస్తానన్నాడు.

రాత్రి భోజనాల దగ్గర "మీ తమ్ముడికి గిఫ్ట్ ఏమిద్దామనుకుంటున్నావు?'' అని భార్యను అడిగాడు మహేంద్ర.

జవాబు చెప్పడానికి తటపటాయించింది విశాల.

"చిన్నపిల్ల అమ్మాయికేం తెలుసురా? ఏమిస్తే బావుంటుందో నువ్వే చెప్పు'' అంది రాజేశ్వరమ్మ.

"నేను చెప్పనా?'' అంది సుశీల నవ్వుతూ.

"తమ్ముడిని పెళ్లికొడుకు చేసినప్పుడు అక్క రెడీమేడ్ సూట్ ఇస్తే బావుంటుంది'' అంది సుశీల.



ఆమె సలహా అందరికీ నచ్చింది.

"అవును. నేనూ అదే అనుకున్నాను. చూడు విశాలా! మీ తమ్ముడిని బజారుకి తీసుకువెళ్ళి సుమారు ఐదారువేలలో మంచి రెడీమేడ్ సూట్ అతనికి నచ్చిన కలర్‌ది కొనివ్వు" అన్నాడు.

భర్త మాటలను ముందు నమ్మలేకపోయింది. తరువాత ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయింది.

తమ్ముడికి ఆరేడు వందలలో రిస్ట్‌వాచీ కొనిస్తే బావుంటుంది అనుకుంది.


ఇంకా నయం బయటకు చెప్పలేదు అని సిగ్గుపడింది.

భోజనాలయ్యాక రాజేశ్వరమ్మ పెద్దకోడలిని పిలిచి ఊరికి వెళ్లడానికి ఎంత డబ్బు కావాలో విశాలకు ఇవ్వమని బీరువా తాళాలు ఇచ్చింది.

సుశీల బీరువా తెరిచి "ఎంత కావాలి?" అని విశాలను అడిగింది.


## కన్నీళ్లు తెప్పించని ఉల్లిపాయ

ఉల్లిపాయల్ని తరుగుతుంటే మనకి కన్నీళ్లు వస్తాయి. కానీ అసలలా కన్నీళ్లను తెప్పించే గుణం దానికెందుకుందో ఇంతకాలం ఎవరికీ తెలియదు. అయితే ఇటీవల న్యూజీలాండ్, జపాన్ శాస్త్రజ్ఞుల బృందమొకటి తమ రీసెర్చ్‌లో కన్నీళ్లను తెప్పించే ఎంజైమ్‌కి



మూలాధారమైన జన్యువును తొలగించి బయోటెక్నాలజీ ద్వారా కొత్తరకం ఉల్లిపాయను పడించగలిగారట. ఒక పదేళ్లల్లో కన్నీళ్లు తెప్పించని ఈ ఉల్లిపాయల్ని విస్తారంగా పండించి మార్కెటింగ్ చేయగలమని వారంటున్నారు.

-తటవర్తి




విశాలకు ఏం చెప్పాలో అర్థంకాక తికమకపడింది.

"పదివేలు చాలా? ఇంకా ఎక్కువ కావాలా?" అంది,.

"చాలు...చాలు" అంది తడబడుతూ.

***

రాజేశ్వరమ్మ మర్నాడు ఉదయం డ్రైవర్ని పిలిచి ట్యాంకు నిండా పెట్రోలు పోయించుకుని రమ్మని చెప్పింది.

"విశాలా! కారు తీసుకుని వెళ్లు. పెళ్లయ్యేవరకు కారు నీ దగ్గరే వుంచుకో. అవసరం ఉండవచ్చు. డ్రైవరున్నాడు కనుక ఫర్వాలేదు" అంది.

అత్తగారి విశాల హృదయాన్ని మనసులోనే మెచ్చుకుంది విశాల.

***

భర్త చెప్పినట్లు తమ్ముడిని షాపుకు తీసుకువెళ్లి రెడీమేడ్ సూటు కొంది.

"ఆడపిల్లకు మేమివ్వాలిగానీ నీవద్ద నుండి మేం తీసుకోవడమేమిటి? అయినా అయిదువేలు పెట్టి కొనడం ఏమీ బాగాలేదు అమ్మాయ్. అల్లుడుగారికి, అత్తగారికి ఈ విషయం తెలిస్తే ఏం బావుంటుంది చెప్పు" అంది విశాల పినతల్లి.

"ఫర్వాలేదు పిన్నీ... మీ అల్లుడుగారే చెప్పారు సూటు కొనివ్వమని."

"వాళ్లు మర్యాదకోసం చెప్పినా మనం ముందూ వెనుకలు ఆలోచించుకోవాలి తల్లీ" అంది.

***

పెళ్లి భవానీపురం రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో. ఆడపెళ్లివారు వీరికోసం రానుపోనూ మినీ బస్సు ఏర్పాటు చేసారు.

పెళ్లిరోజు ఉదయం విశాల, ఆమె తల్లిదండ్రులు, పిన్ని కొడుకు కారులోనూ, మిగిలినవారు మినీ బస్సుల్లోనూ భవానీపురం బయల్దేరారు. కారు గ్రామం పొలిమేర చేరేసరికి అమ్మగారు వస్తున్నారని గ్రామవాసులు కారును చూసి వెంబడించారు.

కళ్యాణ మండపంవద్దకు చేరుకునేసరికి ఒక నడివయస్కుడు కారువద్దకు వచ్చి-

"నమస్కారం అమ్మా! నేను గుర్తున్నానా? అత్తయ్యగారు, చిన్నబాబుగారు రాలేదా?" అన్నాడు కారులోకి తొంగి చూసి.

"నమస్కారం. మీరు శాస్త్రిగారు కదూ. అత్తయ్యగారు వాళ్లు రాలేదండీ. నేను పెళ్లికి వచ్చాను. మా పిన్ని కొడుక్కి పెళ్లి. ఇతనే పెళ్లికొడుకు. అమ్మా, నాన్నగారు, పిన్నీ వచ్చారు" అంది కారులోంచి దిగుతున్నవారిని చూపిస్తూ.

విశ్వనాథశాస్త్రి అందరికీ నమస్కరించాడు.

"మీరు కూడా పెళ్లికి వచ్చారా శాస్త్రిగారూ" అంది విశాల.

"లేదమ్మా. నేనుండేది ఇక్కడే. మీవాళ్ల ఇల్లు, పొలాలు, తోటలూ అన్నీ ఇక్కడే ఉన్నాయి. వాటినన్నిటినీ నేనే చూస్తున్నాను. పదండమ్మా మనింటికి వెళ్దాం. అక్కడైతే మీకు అన్ని సౌకర్యాలూ ఉంటాయి" అన్నాడు.

ఇంతలో పెళ్లికూతురి తల్లిదండ్రులు, మేనమామ కారు వద్దకు వచ్చారు.

"మా యజమానురాలు రాజేశ్వరమ్మగారి కోడలు ఈవిడ. వారు ఆమె తల్లిదండ్రులు. పెళ్లికొడుకు పెత్తల్లి, పెదనాన్నగారు. వీరంతా రాజేశ్వరమ్మగారి లోగిలిలో వుంటారు. వీళ్ల బంధువులు ఎవరు వచ్చినా అక్కడికే పంపండి. విడిదిల్లు అదే" అన్నాడు శాస్త్రి.

"అలాగేనమ్మా. కాఫీ ఫలహారాలు అవి అక్కడికే తెస్తాం" అన్నాడు పెళ్లి పెద్ద.

దేవాలయానికి వంద గజాల దూరంలోనే వుంది రాజేశ్వరమ్మగారి ఇల్లు. ఇంటిముందు విశాలమైన ఆవరణ. అందులో ఒకపక్క రేకుల షెడ్డు. దానిలో ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లు. ఇంటి వసారాలో నాలుగడుగుల ఎత్తులో విశాలమైన అరుగులున్నాయి. మండువా వాకిలి ఇల్లు. మొత్తం పది గదులున్నాయి.

అందులో నాలుగు గదులకు ఆధునిక సౌకర్యాలు కల్పించబడ్డాయి. అవి రాజేశ్వరమ్మగారి కుటుంబ సభ్యులకోసం. వెనుకవ్రక్క మూడు గదులూ విశ్వనాథశాస్త్రి కుటుంబం వాడుకుంటున్నారు. ఒక గదిలో మధ్యలో నిలువెత్తు ఐరన్ సేఫ్ ఉంది. మండువాలోని వసారాలో ధాన్యం బస్తాలు నెట్టువేసి ఉన్నాయి.

పల్లెటూరిలో అంత పెద్ద ఇల్లు అన్ని సౌకర్యాలతో ఉండడం చూసి విశాల విస్తుపోయింది.

ఆమెకు ఈవిషయాలు తెలియవు. శాస్త్రి తన భార్య, పిల్లల్ని పరిచయం చేసాడు.

కోడలు వాళ్లు వచ్చిన విషయం రాజేశ్వరమ్మగారికి ఫోన్‌చేసి చెప్పాడు శాస్త్రి. వారికి ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా చూడమని రాజేశ్వరమ్మ చెప్పింది. విశాల అత్తగారితో మాట్లాడింది.

ఎంతో ఉత్సాహంగా ఉందని, తనకు ఇక్కడికి వచ్చేవరకూ విషయం తెలియదని చెప్పింది.

రాజేశ్వరమ్మగారు మహేంద్ర సాయంత్రం వస్తారని శాస్త్రిగారు చెప్పారు విశాలకు.

***

రాజేశ్వరమ్మగారి కోడలు వచ్చిందని గ్రామ పెద్దలు, ఆడవారు మగవారు అందరూ వచ్చి విశాలను ఆప్యాయంగా పలకరించి గౌరవ మర్యాదలు చేసి కట్నకానుకలు ఇచ్చారు.

"మీ అత్తయ్యగారు రాజేశ్వరమ్మగారు తల్లిదండ్రులకు ఏకైక సంతానం. మొగపిల్లలు లేరు. ఈ ఆస్తికి వారసురాలు ఆమె. వారికి ఈ గ్రామంలో పాతిక ఎకరాల పల్లం, పదేసి ఎకరాల మామిడి, కొబ్బరి, అరటి, చెరకు తోటలున్నాయి. మీ అత్తగారి పూర్వీకులు అమ్మవారి ఆలయం కట్టించి ధూపదీప నైవేద్యాలకు పాతిక ఎకరాల పొలం దానమిచ్చారు. దానిమీద వచ్చే రాబడితో అమ్మవారికి నిత్యం అర్చనాది కార్యక్రమాలు జరిపిస్తున్నారు. మీ అత్తయ్యగారు అన్ని వసతులతో కళ్యాణ మండపం కట్టించారు. వివాహాది శుభకార్యాలకు కళ్యాణ మండం, వంట పాత్రలు, కుర్చీలు వగైరా సామాన్లను ఉచితంగా ఇస్తున్నాము. దూర ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ శుభకార్యాలు జరుపుకుంటున్నారు. అమ్మవారికి దేవీ నవరాత్రి పూజలు ఏటా అత్తయ్యగారు సొంత డబ్బుతో జరిపించి అన్నదానం చేస్తున్నారు. మా తాత ముత్తాతల కాలం నుంచి మేము వారి కొలువులోనే వుంటున్నాము. మీ అత్తయ్యగారు దానధర్మాలు చేయడంలో తాత ముత్తాతలను మించిపోయారు.

మీ అత్తయ్యగారు తన కొడుకుల సంపాదనలో ఒక్క పైసా కూడా ఇంటి ఖర్చులకు వాడకుండా దానిని నెలనెలా వాళ్ల పేర బ్యాంకులో వేస్తున్నారు. మీ మామయ్యగారి హయాం నుంచీ ఇంటి ఖర్చులకు ఆవిడే డబ్బు ఖర్చు చేస్తున్నారు. బహుశా మీకీ సంగతులు తెలియవనుకుంటాను.

అమ్మా! మీ అత్తయ్యగారి విశాల హృదయం, మంచి మనసు, ధర్మగుణం వల్ల ఆవిడకు రత్నాలవంటి కొడుకులు కలిగారు. అనుకూలవతులైన కోడళ్లు కూడా లభించారు. ఈప్రాంత వాసులకు అమ్మవారు కనిపించని దేవత అయితే, రాజేశ్వరమ్మగారు కనిపించే దేవత. దేవతలు కొలిస్తేనే వరాలిస్తారు. కోరకుండా అవసరాలు గ్రహించి అనుగ్రహించే దేవత మీ అత్తయ్యగారు అమ్మా" అన్నాడు శాస్త్రి.

శాస్త్రిగారు చెప్పిన మాటలు వింటుంటే విశాల తల సిగ్గుతో వాలిపోయింది.

అత్తగారి విశాల హృదయాన్ని, మంచి మనసును, మమకారాన్ని గుర్తించకుండా తప్పుడు ఆలోచనలతో ఆవిడపట్ల దురుసుగా ప్రవర్తించినందుకు విశాల హృదయం పశ్చాత్తాపంతో తల్లడిల్లిపోయింది. వెంటనే వెళ్లి ఆవిడ కాళ్లమీదపడి క్షమాపణ కోరుకోవాలనుకుంది.

★



## హిట్ కోసం...

హిట్ కోసం ఆశగా ఎదురుచూస్తున్న స్నేహకి 'నీ సుఖమే నే కోరుకున్నా' చిత్రం కూడా నిరాశను మిగిల్చింది. 2006లో వచ్చిన 'శ్రీరామదాసు' తర్వాత మధుమాసం, మనసు పలికే మౌనరాగం, మహారథి.. తాజాగా 'నీ సుఖమే నే కోరుకున్నా' సినిమాలు ఫ్లాపై స్నేహ కెరీర్‌కి నష్టాన్నే చేకూర్చాయి. ఆమె ప్రస్తుతం పాండురంగడు, ఆదివిష్ణు సినిమాల్లో నటిస్తోంది. 'పాండురంగడు' చిత్రంపైనే స్నేహ ఆశలన్నీ పెంచుకుంది.

